వెల్లివిరిసిన.. కార్తీక శోభ

దక్షిణలో కార్తీకశోభ వెల్లివిరుస్తోంది. శనివారం నుంచి కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. ఎక్కడ చూసినా భక్తులే కనిపిస్తున్నారు. నిత్య పూజలు, దైవనామ స్మరణతో ఆలయాలు మార్మోగుతున్నాయి. ఇతర ప్రాంతాల కంటే దక్షిణలో ఆలయాలు ఎక్కువ. దీంతో ఈ కార్తీకం ఆధ్యాత్మిక సౌరభంతో అలరారుతోంది. ఆలయాలన్నీ కళకళలాడుతున్నాయి.

అందంగా ముస్తాబైన ఆలయాలు • నెలరోజుల పాటు జరగనున్న ప్రత్యేక పూజలు



మెయిన్‌రోడ్డులో గల విశ్వేశ్వరాలయం

దాబాగార్డెన్స్: నియోజకవర్గం కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాసం అనగానే ప్రతివారిలో ఓ ఆనందం. ఉదయాన్నే నిద్రలేచి.. స్నానం చేసి దేవాలయాలకు వెళ్లే వారు కొందరైతే.. ఇంటి ముందు తులసమ్మకు దీపారాధన చేసేవారు ఇంకొందరు. కార్తీక మాసం ప్రతిరోజూ శివాలయాలకు వెళ్లేవారు మరి కొందరు. అలాగే కార్తీక మాసం వచ్చిందంటే అయ్యప్ప భక్తుల కోలాహలం మరింత ఎక్కువగా కనిపిస్తుంది. వారు కూడా వేకువ జామునే నిద్రలేచి చన్నీటి స్నానం చేసి పీఠంలో ఏర్పాటు చేసుకున్న అయ్యప్ప స్వామి విగ్రహం/చిత్రపటాలకు నిష్ఠతో పూజలు చేస్తారు. ప్రతిరోజూ ఏదో దేవాలయానికి వెళ్తుండడంతో పండగ వాతావరణం కనిపిస్తుంది.

శివాలయాలకు కార్తీక శోభ..

శివాలయాలకు కార్తీక శోభ వచ్చేసింది. కార్తీమ మాసంలో వచ్చే సోమవారాల్లో శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడనున్నాయి. సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో గల విశ్వేశ్వర ఆలయం, వన్‌టౌన్‌లో గల భీమశంకర ఆలయం, మహిళా పోలీస్ స్టేషన్ సమీపాన గల ఉమా రామలింగేశ్వరాలయం, సింగ్ హోటల్ జంక్షన్‌లోని ఓంకార ఆలయం, గొల్లలపాలెంలో గల ఉమా శంకరాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల శివాలయం, ఏవీఎన్ కాలేజీలో గల శివాలయాలు ఇప్పటికే కార్తీక శోభను సంతరించుకున్నాయి.

కూరగాయల ధరలకు రెక్కలు..

కార్తీక మాసం వచ్చిందంటే చాలు కూరగాయల ధరలకు రెక్కలు వచ్చేస్తాయి. కార్తీక మాసంలో నాన్‌వెజ్ తినేవారి సంఖ్య తక్కువగా ఉండడం.. అందరూ కూరగాయలపై పడడంతో వాటి ధరలు ఇప్పటికే ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యుడికి అందనంత ఎత్తుకు ఎగబాకాయి. నెల రోజుల కిందట రూ.200కే సంచి నిండేది. ప్రస్తుతం రూ.300 తీసుకెళ్లినా సగం కూరగాయలు కూడా రావడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమాటా కేజీ రూ.70, వంకాయలు కేజీ రూ.60, బెండకాయలు రూ.40 నుంచి రూ.50, ఉల్లిపాయలు రూ.60, చిక్కుడు రూ.50 నుంచి రూ.60, క్యారట్ రూ.50 ఇలా.. ధరలు మండిపోవడంతో సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు.

తగ్గిన నాన్‌వెజ్ విక్రయాలు..

కార్తీక మాసం వచ్చేసింది. ఇంకేముంది.. అందరూ కాయగూరల వైపే మొగ్గు చూపుతున్నారు. నిత్యం నాన్‌వెజ్ తినేవారిలో కూడా కొంత మంది కార్తీక మాసంలో నాన్‌వెజ్‌ను పక్కన పెడుతున్నారు. దీంతో నాన్‌వెజ్ వ్యాపారాలు కొంత మందగించనున్నాయి. ఇప్పటికే చేపల మార్కెట్లు, మాంసం దుకాణాలు వెలవెలబోతున్నాయి.





కార్తీకంలో అంతకంతకూ పెరుగుతున్న కూరగాయల ధరలు

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



ఆకాశదీప పూజలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: నియోజకవర్గంలో శివాలయాలు కార్తీక శోభ సంతరించుకున్నాయి. పలు ఆలయాల్లో శనివారం తెల్లవారు జాము నుంచి మూలమూర్తులకు పంచామృతాభిషేకాలు, విభూది అర్చన, ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేపట్టారు. భక్తులు ఉదయం నుండి పూజలకు తరలిరావటంతో ఆలయాలు కిటకిటలాడాయి. అల్లిపురంలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానం, శ్రీ భవానీ శంకర గణపతి ఆలయం, మెయిన్‌రోడ్డులో గల ఉమామహేశ్వర ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయం, మురళీధరవీధిలో గల పంచముఖేశ్వర ఆలయంలో నెల రోజుల పూజలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆయా ఆలయాల ప్రతినిధులు తెలిపారు.



శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలోని ఉమా చంద్రమౌళేశ్వరుడు

శివరామకృష్ణ దేవాలయంలో..

అస్సాంగార్డెన్స్‌లో గల శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో వేంచేసిన శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరునికి అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, విభూతి అర్చన, ప్రత్యేక పూజలు చేపట్టారు.

నర్సుల పదోన్నతుల కోసం కృషి

మహారాణిపేట: గత 30 సంవత్సరాలుగా నర్సులకు ఎలాంటి పదోన్నతులు లేవని, విధుల్లో చేరిన నాటి పోస్టుల్లోనే పని చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షురాలు టి.గంగాభవానీ, కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి అన్నారు. శనివారం కేజీహెచ్ ఆవరణలో నర్సుల క్లాక్ రూమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గంగాభవానీ మాట్లాడుతూ ఈ విషయంలో త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. రోగుల సేవలో ఉన్న నర్సులకు అన్ని విధాలుగా అన్యాయం జరిగిందని, ఒక్కొక్కసారి 24 గంటలు విధులు నిర్వహిస్తున్నామని, సమయపాలన లేకుండా పని చేస్తున్నామని గంగాభవానీ తెలిపారు. దీని వల్ల ఒక్కోసారి కుటుంబ పరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి మాట్లాడుతూ నర్సులు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల సంఖ్య పెంచుతున్నారని, కాని ఎక్కడా నర్సుల సంఖ్య పెంచడం లేదని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ముగ్గురు నర్సులు పని చేస్తున్నారని, ఇందులో ఒకరు సెలవు పెడితే మిగిలిన వారిపై అదనపు భారం పడుతుందన్నారు. అక్కడ నాల్గో నర్సు పోస్టును భర్తీ చేయాలన్నారు. అలాగే కేజీహెచ్‌లో వివిధ సమస్యలను సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



మాట్లాడుతున్న నర్సుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగాభవానీ, వరలక్ష్మి

నైపుణ్యాభివృద్ధితోనే ఉత్తమ అవకాశాలు

మురళీనగర్ : విద్యార్థులు తమ రంగానికి సంబంధించి నైపుణ్యాలు మెరుగుపరచుకున్నప్పుడే ఉన్నత అవకాశాలు లభిస్తాయని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. బిల్డింగ్ రెజీలియస్ అండ్ కోపింగ్ స్కిల్స్ ఫర్ సక్సెస్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ సంస్థ ప్రతినిధి డాక్టర్ జయపూజిత అధ్యక్షతన నైపుణ్యాల సాధనపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మంచి మిత్రులతో స్నేహం చేయడం వల్ల జ్ఞాన సంపద పెరుగుతుందన్నారు. చెడు సావాసాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ జయపూజిత మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. భవిష్యత్‌లో నిర్దేశిత లక్ష్యాలు సాధించాలంటే క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. లక్ష్య సాధనకు నిజాయితీగా శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీ రమణ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

సీతంపేట : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఇస్కఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. ఇస్కఫ్ జిల్లా సర్వసభ్య సమావేశం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ వచ్చేనెల జరగనున్న జానపద కళా ప్రదర్శనకు రాష్ట్ర టూరిజం మంత్రిని ఆహ్వానించాలని కళాకారుల సంఘం భావించిందన్నారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇస్కఫ్ జిల్లా కార్యవర్గంలో ఒకరైన జె.వి. ప్రభాకర్ కొంత కాలంగా తనే అధ్యక్షునిగా సమావేశాలు ఏర్పాటు చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని, అతనిపై రాష్ట్ర నాయకత్వం చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో మధుమతి, ఎంఏ బేగం, సత్యవతి, సూర్యకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇస్కఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు

క్లుప్తంగా

వివేకానంద సంస్థలో వస్త్ర, అన్నదానం



అన్నదానం చేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: శనివారం పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో పేదలకు వస్త్ర, అన్నదానం, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. వివేకానంద సంస్థకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్బూద్ అహ్మద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు, ట్యూషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఆశ్రయం



ఆశీలమెట్టలోని మెన్ షెల్టర్‌లో ఉన్న సాయి

సీతమ్మధార: కుటుంబ సభ్యులు ఆదరించకపోవడంతో గత రెండేళ్లుగా ఆర్టీసీ బస్టాండ్ దగ్గర రోడ్డుపైనే ఉంటున్నాతను. ఏయూటీడీ అధికారులు ఫీల్డ్ విజిట్‌లో సాయిని మెన్ షెల్టర్‌కు తరలించారు. కైలాసపురానికి చెందిన సాయి ఒక ప్రైవేట్ స్కూల్లో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేశారు. కుటుంబ సభ్యులు ఆదరించకపోవడంతో రోడ్డు పైనే ఉంటున్నాడు. ఏయూటీడీ అధికారులు అతన్ని గమనించి మెన్స్ షెల్టర్‌కు తరలించారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 18.36 లక్షలు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో శనివారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు అమ్మవారి హుండీల లెక్కింపు నిర్వహించారు. 52 రోజులకుగాను అమ్మవారికి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.18,36,316 వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. పెందుర్తి వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవో ఎం.నీలిమ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం



మాట్లాడుతున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

సీతంపేట : జనసైనికులంతా అంకితభావంతో రాష్ట్ర నిర్మాణం కోసం కలిసికట్టుగా పని చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. సీతంపేటలో గల జనసేన నగర కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ 2019లో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చేపట్టిన లాంగ్‌మార్చ్‌తో జనసేన ప్రజల పక్షాన పోరాటం ప్రారంభించిందని గుర్తు చేశారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

14న బాలలకు వివిధ పోటీలు

దాబాగార్డెన్స్: మిరాకిల్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైజాగ్ లిటిల్ ఛాంపియన్-2024 పేరిట (టాలెంట్ హంట్) ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ ఎండీ షకీల్ తెలిపారు. ఈ మేరకు శనివారం సంస్థ కార్యాలయంలో పిల్లలచే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షకీల్ పోటీల వివరాలు వెల్లడించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా ఈనెల 14 ఉదయం 9.30 నుంచి సాయంత్రం 8.30 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఈ నెల 17 ఉదయం 8.30 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయన్నారు. వెస్టన్, క్లాసికల్, ఫోక్, సింగింగ్, ట్రెడిషనల్, గెటప్స్, మిమిక్రీ, జోక్స్, ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ తదితర పోటీలు ఉంటాయని, అన్ని వయసుల వారు అర్హులేనని చెప్పారు. పోటీలో పాల్గొనదలిచే వారు ఈ నెల 5వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9966485335 నంబరులో సంప్రదించాలన్నారు.



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్నారులు

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలోను పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణం తీరని లోటు

ప్రొఫెసర్ బాబీవర్ధన్

దాబాగార్డెన్స్: ఢిల్లీ ప్రొఫెసర్ సాయిబాబా మరణం మానవ హక్కుల పరిరక్షణకు తీరని లోటని, దానిని ఎవరూ పూడ్చలేరని ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం విభాగం పూర్వ విభాగాధిపతి ప్రొఫెసర్ బాబీ వర్ధన్ పేర్కొన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖ కమిటీ ఆధ్వర్యంలో శనివారం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బాబీ వర్ధన్ మాట్లాడుతూ నేటి ప్రసార మాధ్యమాలు అదానీ, అంబానీ వంటి వారి చేతుల్లో నడుస్తున్నాయన్నారు. ప్రజలకు సాయిబాబా వంటి ప్రజా ఉద్యమాలకు నిలయమైన వ్యక్తులకు జరిగే నష్టాలు తెలియజేయడంలో ప్రసార మాధ్యమాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే ఢిల్లీ ప్రొఫెసర్ సాయిబాబా అరెస్టు, ప్రభుత్వ కక్ష సాధింపు, అలాగే న్యాయ వ్యవస్థ విఫలం కూడా అయ్యే పరిస్థితులు దాపురించాయన్నారు. పూర్వ న్యాయవాద సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సాయిబాబాను ప్రత్యేక చీకటి గదిలో జైల్లో ఉంచి, ఆయనకు అందించాల్సిన హక్కులు కూడా ఇవ్వకుండా హరింపజేయడంలో రాజ్య హింస ప్రస్ఫుటమైందన్నారు. సీనియర్ న్యాయవాది వీవీ బాలకృష్ణ మాట్లాడుతూ పీడిత ప్రజల హక్కులు కాపాడడంలో సాయిబాబా పాత్ర వేగుచుక్క వంటిదని కొనియాడారు. ఐలూ విశాఖ యూనిట్ అధ్యక్షుడు అల్లు సురేష్ మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబాను 2014లో అరెస్టు చేశారన్నారు. సుమారు 1500 రోజులకు పైగా రిమాండ్ ఖైదీగా ఆయన గడిపారన్నారు. 90 శాతం అంగవైకల్యం కలిగిన సాయిబాబాపై రాజ్యం దాడి వల్ల జైల్లో ఆయన అంతర్గత అవయవాలు పూర్తిగా వైద్య మందక పాడైపోయాయని, ఆ కారణంగానే ఆయన మరణం సంభవించిందని వాపోయారు. ఇది ఒక రకంగా హక్కుల పరిరక్షణ కార్యకర్తకు ప్రభుత్వం ఇచ్చిన బహుమతి వంటిదన్నారు. కార్యక్రమంలో ఐలూ జనరల్ సెక్రటరీ ఎస్. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చాట ఆనందరెడ్డి, కేవై మణి, కోశాధికారి అప్పలరెడ్డి, పెద్ద ఎత్తున సీనియర్, జూనియర్ న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ సస్పెన్షన్ సంతోషకరం

సీతమ్మధార : విశాఖపట్నంలో ఎన్నడూలేని విధంగా విచారణ పేరుతో గంగ అనే పని మనిషిని ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో దారుణంగా కొట్టి, కాలు విరగ్గొట్టిన ఘటనకు బాధ్యులైన క్రైం ఎస్ఐ జగదీష్‌ను సస్పెండ్ చేయడం సంతోషకరమని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఉపాధ్యక్షురాలు పి.మణి శనివారం ధన్యవాదాలు తెలిపారు. అతనికి సహకరించిన సీఐ బంగారు పాపపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించిన సీపీ శంఖబ్రత బాగ్చికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఈ ఘటనకు కారకురాలైన ఆక్సిజన్ టవర్స్‌లో నివసిస్తున్న 820 నంబరు ఫ్లాట్ యాజమాని ప్రియాంకపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. పోలీసుల దౌర్జన్యానికి బలైన గంగకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు.

మంత్రివర్యా.. ఇది కాదా అభివృద్ధి..!

- ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ పాలనలో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం
- అయినా రోడ్లపై ‘తట్టెడు మట్టి పోయలేదంటూ’ మంత్రుల దుష్ప్రచారం
- కూటమి నాయకుల అసత్య ప్రచారంపై ప్రజల మండిపాటు

కంచరపాలెం : వైఎస్సార్‌సీపీ నేతలు ప్రజాధనం దోచుకుని తమ అవసరాలు తీర్చుకున్నారే తప్ప రోడ్లపై గుంతలు పూడ్చలేదంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి మాటలతో నగర ప్రజలు విస్తుపోతున్నారు. ముఖ్యంగా మంత్రి మాటలపై నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిందంతా అభివృద్ధి కాదా మంత్రి గారూ..! అంటూ స్థానికులు నిలదీస్తున్నారు. అసలేం జరిగిందంటే... విశాఖ నగర పర్యటనలో భాగంగా గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని శనివారం చేపట్టిన మంత్రి డోలా మాట్లాడుతూ నగర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. కనీస అభివృద్ధి జరగలేదన్నట్లు మాట్లాడారు. వాస్తవానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగర వ్యాప్తంగా వేల కోట్ల రూపాయలతో బీటీ, సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. ముఖ్యంగా దక్షిణ నియోజకవర్గంలోని బౌడారా రోడ్డులో బీటీ రోడ్లు, బంగారమ్మమెట్టలో సీసీ రోడ్లు, సీసీ కాలువలు, 33వ వార్డు గోవిందరోడ్డులో సీసీ కాలువలు నిర్మించారు. అల్లిపురం, వెంకటేశ్వరమెట్ట, గోవిందరోడ్డు, కంచరపాలెం, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, సీతమ్మధార, సీతంపేట... ఇలా అన్ని ప్రాంతాల్లో కలిపి రోడ్ల నిర్మాణానికే రూ.94 కోట్లకు పైగా ఖర్చు చేశారన్న విషయం ప్రజలందరికీ తెలిసిన విషయమే. తాగునీరు, డ్రైనేజీల నిర్మాణం, ఆధునికీకరణ, కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాల నిర్మాణానికి కలిపి మొత్తంగా రూ.435 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి చేశారు. ఈ పనులన్నీ జీవీఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలోనే పూర్తయ్యాయి. అయినప్పటికీ కూటమి నాయకులు, మంత్రులు అసత్య ప్రచారం చేస్తుండడంపై నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో నగరం ఎంతో అభివృద్ధి చెందిందని... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా మంత్రులు అభివృద్ధిపై మాట్లాడడమే తప్ప... ఎక్కడా అభివృద్ధి చేసింది లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు ప్రారంభమయ్యాయని స్థానిక ప్రజలు చెబుతున్నారు.



జ్ఞానాపురంలో 2023లో బీటీ రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు



104 ఏరియాలో నిర్మించిన రహదారి



2023లో కంచరపాలెం నేతాజీ కూడలిలో నిర్మించిన రోడ్డు